సాక్షి ఖమ్మం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



అటూఇటుగా కాలం

ఈ ఏడాది వరి సాగు చేసిన రైతులకు కలిసిరాగా.. పత్తి రైతులకు నష్టం ఎదురైంది. మరోవక్క భారీ వర్షాలు దెబ్బతీశాయి. 8లో



చిత్తశుద్ధితో విధులు

వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీహెచ్ అమర్‌సింగ్ ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం 30° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలిగాలుల ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



గంగారంలో వివరాలు ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా వేగం పెంచాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. సత్తుపల్లి మండలం గంగారంలో శనివారం ఆమె సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడి సిబ్బంది అడిగిన సమాచారం, పత్రాలు సమర్పించారా, సిబ్బందికి ముందుగా సమాచారం ఇచ్చారా అని ఆరా తీశారు. ఇక సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా లక్ష్యం మేరకు ప్రతిరోజు సర్వే చేయాలని తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం, పల్లకిసేవ జరిపించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన భక్తులు కల్యాణవేడుకను తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

25.70లక్షల మొక్కల పెంపకానికి ప్రణాళిక



చెన్నారం నర్సరీలో పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష

నేలకొండపల్లి: వచ్చే వానాకాలంలో హరిత హారం కోసం జిల్లాలోని నర్సరీల్లో 25.70 లక్షల మొక్కల పెంపకానికి ప్రణాళిక రూపొందించామని అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను శనివారం ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం శిరీష మాట్లాడుతూ జిల్లాలోని 589 గ్రామపంచాయతీల నర్సరీల్లో వచ్చే ఏడాదికి కావాల్సిన మొక్కల పెంపకానికి ఇప్పటికే పనులు మొదలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 12.49 లక్షల మొక్కలు సిద్ధంగా ఉండగా, మరిన్ని పెంచనున్నట్లు చెప్పారు. కాగా, ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఈ ఏడాది 62లక్షల పని దినాలకు గాను 54.33 పనిదినాలు పూర్తయ్యాయని వెల్లడించారు. ఇదేసమయాన వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టే పనుల గుర్తింపునకు గ్రామసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఈ ఏడాది అన్ని కేటగిరీల్లోనూ నేరాల సంఖ్య పెరిగిందనే చెప్పొచ్చు. రోడ్డు ప్రమాదాలతో రహదారులన్నీ రక్తసిక్తమై పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు క్షతగాత్రులై ఆస్పత్రుల పాలయ్యారు. అన్నింటితో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరగాళ్లు విచ్చలవిడిగా రెచ్చిపోయారు. గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లావ్యాప్తంగా కేసులు నమోదు కావడం గమనార్హం. ఇక దొంగలైతే తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడ్డారు. ఈమేరకు 2024 ఏడాదికి సంబంధించి పోలీసులు వెల్లడించిన నేర నివేదికలోని వివరాల ఆధారంగా కథనం. – ఖమ్మంక్రైం



సైబర్ నేరగాళ్లు దోచేశారు..

రివైండ్ 2024

గత ఏడాదితో పోలిస్తే నాలుగు రెట్ల సొమ్ము స్వాహా

- ప్రమాదాలతో రక్తసిక్తమైన రహదారులు
- మున్నేరు వరదల్లో పోలీసుల సాయం భేష్
- 2023తో పోలిస్తే ఈ ఏడాది పెరిగిన నేరాలు

రూ.34కోట్లు స్వాహా

ప్రజల అమాయకత్వమే ఆసరాగా సైబర్ నేరగాళ్లు ఈ ఏడాది రెచ్చిపోయారు. గత సంవత్సరం రూ.9కోట్లకు పైగా ప్రజల ఖాతాల్లోని సొమ్మును దోచుకోగా.. ఈసారి రూ.34 కోట్లకు పైగా కాజేశారు. కానీ గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ మాత్రం ఎక్కువగానే చేశారు. గత ఏడాది రూ.16 లక్షల రికవరీ చేయగా.. ఈసారి ఆ మొత్తం రూ.52,13,310గా నమోదైంది. అంతేకాక మరో రూ.2.42కోట్ల మేర సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా హోల్డ్‌లో పెట్టించగలిగారు. అలాగే, ఆన్‌లైన్‌లో మోసాలు గత ఏడాది 1,098 జరగ్గా.. ఈఏడాది 1,742 కేసులు నమోదయ్యాయి. అలాగే సోషల్ మీడియా, ఆన్‌లైన్‌కు సంబంధించి గత ఏడాది 129 మోసాలు జరిగితే ఈ ఏడాది 195 జరిగాయి. క్రిప్టో కరెన్సీపై గత ఏడాది రెండు, ఈ ఏడాది నాలుగు కేసులు నమోదయ్యాయి. మొబైల్ ఫోన్ల చోరీ విషయానికొస్తే గత ఏడాది 1,091, ఈ ఏడాది 2,230 కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 1,075 ఫోన్లను పోలీసులు రికవరీ చేయలిగారు.



మృత్యుదేవత కరాళ నృత్యం

ఈ సంవత్సరం గత ఏడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు భారీగా పెరిగాయి. మొత్తం 785 ప్రమాదాలు జరగ్గా.. అందులో 271 మంది మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ టేక్, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతోనే ఈ ప్రమాదాలు జరిగాయని భావిస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేసి మృత్యువాత పడ్డ సంఘటనలు నమోదయ్యాయి.



వరద ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటిస్తున్న సీపీ సునీల్‌దత్ (ఫైల్)

వరద వేళ పోలీసుల సేవలు భేష్

ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో మున్నేరు ప్రళయరూపం దాల్చింది. మున్నేటి వరదతో ఇరువైపులా ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండలాల్లోని కాలనీలు నీటమునిగాయి. ముంపు ప్రాంతాల్లో సీపీ సునీల్‌దత్ ఆధ్వర్యాన పోలీసులు సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. సీపీ మొదలు హోంగార్డు స్థాయి వరకు వరద సహాయక చర్యల్లో పాల్గొనగా.. శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు సైతం సేవలందించారు.

గత ఏడాది, ఈ ఏడాది కమిషనరేట్‌లో నమోదైన ప్రధానమైన నేరాల వివరాలు

నేరాలు	2023	2024
దొంగతనాలు	06	05
హత్య, దొంగతనం	01	02
ఇళ్లలో చోరీలు	150	230
చైన్ స్నాచింగ్‌లు	31	32
ద్విచక్రవాహనాల చోరీలు	278	431
హత్యలు	36	39
అత్యాచారాలు	56	70
మహిళల అదృశ్యం	320	379
ఆచూకీ లభించింది	271	357
పురుషుల అదృశ్యం	118	179
దొరికిన వారు (పురుషులు)	93	152

కలవరపరిచిన బలవన్మరణాలు



ఈ సంవత్సరం బలవన్మరణాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. తల్లి మందలించిందని, తండ్రి తిట్టాడని.. ఆర్థిక బాధలు తట్టుకోలేకపోతున్నామని.. పరువు పోతోందని రకరకాల కారణాలతో పలువురు ప్రాణాలు తీసుకున్నారు.



వైరాలో విద్యార్థి మృతి చెందిన ప్రమాదస్థలం

మానవత్వం మంటగలిసింది..

ఈ ఏడాదిలో కొన్ని నేరాలు మానవత్వానికి మచ్చగా మిగిలిపోయాయి. గంజాయికి డబ్బు ఇవ్వలేదని ఖమ్మం రోటరీనగర్‌లో అమ్మమ్మను మనవడు హత్య చేశాడు. ఇక తన ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని ఖమ్మం ఖానాపురంలో తల్లిని కుమారుడు హతమార్చాడు. అలాగే, నేలకొండపల్లిలో ఇంట్లో ఆశ్రయం పేరిట చేరిన కొందరు కలిసి వృద్ధ దంపతులను పాశవికంగా హత్య చేశారు.



నేలకొండపల్లిలో హత్యకు గురైన వెంకటరమణ - కృష్ణకుమారి

దొంగల స్వైరవిహారం

దొంగలు ఈ ఏడాది స్వైరవిహారం చేశారు. పోలీస్ పెట్రోలింగ్ లోపించడం, సీసీ కెమెరాలు సరిగా లేకపోవడంతో నిందితులు పేట్రేగిపోయారు. గత ఏడాది రూ.4 కోట్ల మేర కొల్లగొడితే ఈ ఏడాది ఆ మొత్తం రూ.6కోట్లు దాటింది. అంతేకాక గత సంవత్సరం 35శాతం మేర చోరీ అయిన ఆస్తుల రికవరీ ఉండగా ఈసారి అది 28శాతాని(రూ.1.55 కోట్లు)కే పరిమితమైంది.

పెరిగిన మోసాలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో చీటింగ్ కేసులు నమోదు కావడం గమనార్హం. ఇందులో ఎక్కువగా భూసంబంధిత కేసులే ఉన్నాయి. గత ఏడాది 187 చీటింగ్ కేసులు నమోదైతే ఈసారి 397 కేసులు నమోదయ్యాయి.

1,206 కేసులు అదనం

ఈ సంవత్సరం నేరాలు ఎక్కువగా జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే నేరాల సంఖ్య భారీగా పెరిగింది. గత ఏడాది ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో అన్ని ఘటనల్లో కలిపి 7,667 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా.. ఈసారి అదనంగా 1,206 కలిసి 8,873 కేసులు నమోదు కావడం గమనార్హం. ఇందులో హత్యలు, అసాంఘిక కార్యకలాపాలు, చోరీలు తదితర కేసులు ఉన్నాయి.





సీజ్ చేసిన గంజాయి (ఫైల్)

ఈవ్‌టీజింగ్

జిల్లావ్యాప్తంగా గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఈవ్‌టీజింగ్ కేసులూ పెరిగాయి. గత ఏడాది పది కేసులు ఉంటే, ఈ సారి 18 కేసులు నమోదయ్యాయి. కాగా, ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్) కేసులు మాత్రం గత సంవత్సరం 41 నమోదు కాగా, ఈసారి ఆ సంఖ్య 35కు పడిపోయింది. అంతేకాక గత ఏడాది 872 కేజీల గంజాయిని సీజ్ చేయగా.. ఈసారి 384 కేజీల గంజాయిని సీజ్ చేశారు.



శాంతిభద్రతల పరిరక్షణలో ముందంజ



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న సీపీ సునీల్‌దత్, అధికారులు

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో ఈ ఏడాది జిల్లా పోలీసులు ప్రశంసనీయమైన పనితీరు కనబర్చారని కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. కమిషరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ ఏడాది నమోదైన కేసులు, ఇతర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మున్నేటికి వరదలు వచ్చిన సమయాన బాధితులను ఆదుకోవడంలో పోలీస్ సిబ్బంది ముందు నిలిచారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే, చోరీలను అరికట్టేందుకు పెట్రోలింగ్‌ను పెంచామని, శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు విధుల్లో చేరడంతో సిబ్బంది కొరత కూడా కొంతమేర తీరిందని తెలిపారు. ఇకపై పెట్రోలింగ్ మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల విషయమై డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, శ్రీనివాసులు, రవి, సాంబరాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్కంఠగా వాలీబాల్ టోర్నీ

- బాలబాలికల విభాగాల్లో వరంగల్, ఖమ్మం జట్ల ముందంజ
- నేడు ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి



నిజామాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ టోర్నీలో భాగంగా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు శనివారం రెండో రోజుకు చేరగా, పాత పది జిల్లాల నుంచి హాజరైన బాలబాలికల జట్లు లీగ్ దశలో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నాయి. లీగ్ మ్యాచ్‌ల్లో భాగంగా బాలబాలికల విభాగాల్లో వరంగల్, ఖమ్మంతో పాటు నల్లగొండ, నిజామాబాద్ జట్లు ముందంజలో నిలిచాయి. మ్యాచ్‌లను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించగా కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ, ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, వి.నరేష్, రిఫరీలు ఐ.పవన్‌కుమార్, భద్రం, షఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మ్యాచ్‌ల ఫలితాలు...

బాలుర విభాగం లీగ్ మ్యాచ్‌లో పూల్ 'ఏ' నుంచి ఖమ్మం - ఆదిలాబాద్ జట్లు తలపడగా ఖమ్మం జట్టు 25–23, 25–16, 25–23 వరుస సెట్లతో విజయం సాధించింది. అనంతరం మెదక్ - నల్లగొండ మ్యాచ్‌లో మెదక్, వరంగల్-మెదక్ నడుమ మ్యాచ్‌లో వరంగల్ జట్టు గెలిచింది. పూల్ 'బీ'కి వచ్చేసరికి మహబూబ్‌నగర్ - నిజామాబాద్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, కరీంనగర్ - హైదరాబాద్ మధ్య మ్యాచ్‌లో కరీంనగర్, రంగారెడ్డి - హైదరాబాద్ జట్ల నడుమ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. ఇక బాలికల విభాగం పూల్ 'ఏ'లో నల్లగొండ-హైదరాబాద్ మ్యాచ్‌లో నల్లగొండ, ఖమ్మం-రంగారెడ్డి మధ్య మ్యాచ్‌లో ఖమ్మం, నిజామాబాద్ - రంగారెడ్డి నడుమ పోటీలో నిజామాబాద్ గెలిచింది. పూల్ 'బీ'లో ఆదిలాబాద్ జట్టుపై వరంగల్, మెదక్ జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించాయి. కాగా, ఆదివారం రాష్ట్ర స్థాయి టోర్నీ ముగియనుంది.

వివేకానందుడి స్ఫూర్తితో జాతి జాగృతం

- రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ
- సత్తుపల్లిలో మొదలైన తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం



సదస్సును ప్రారంభిస్తున్న బోధమయానందజీ



ర్యాలీలో ఎమ్మెల్యే రాగమయి, స్వామీజీలతో విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప బహుమతి స్వామి వివేకానందుడని, ఆయన ప్రపంచానికే జ్ఞానభిక్ష పెట్టిన మహనీయుడని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యావత్ జాతి జాగృతం కావాలని సూచించారు. సత్తుపల్లిలో శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మేళనంలో భాగంగా తొలుత స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని స్వామిజీలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. అనంతరం జరిగిన విద్యార్థి సమ్మేళనంలో బోధమయానందజీ మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని వివేకానందుడు ప్రపంచానికి చాటారని, ఆయన స్ఫూర్తితో యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఏకాగ్రతతోనే సంకల్ప సాధన

విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడానికి విద్యాసంస్థల్లో అభ్యాసన చేయించాలని విజయవాడ రామకృష్ణ మిషన్ నిర్వాహకులు స్వామి శితికంఠానంద తెలిపారు. తద్వారా వారు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి మార్గం ఏర్పడుతుందని చెప్పారు. శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, గౌతమబుద్ధుడు వంటి మహనీయులు పుట్టిన ఈ దేశంలో వారి వారసులుగా ఏకాగ్రతను పెంచుకోవడం తప్పనిసరి అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. తనకు చిన్నతనం నుంచే పుస్తకపఠనం ఇష్టమని, వివేకానంద, రామకృష్ణ పరమహంస సాహిత్యాలతో పాటు భారతం, రామాయణం చదివానని తెలిపారు. మారుమూల పల్లెటూరులో పుట్టినప్పటికీ డాక్టర్ కావాలనే లక్ష్యంతో చదివి అనుకున్నది సాధించానని చెప్పారు. అపజయాలకు కుంగిపోకుండా పనిచేస్తే విజయం సొంతమవుతుందన్నారు. మనస్సులో దైవత్వాన్ని నింపడమే అన్ని మతాల సారాంశమని ఆమె పేర్కొన్నారు. అనంతరం శ్రీరామకృష్ణ వివేకానంద భావజాలం, చరిత్రకు సంబంధించి ఇచ్చిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే, స్వామిజీ జీవిత చరిత్రపై నిర్వహించిన పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, చల్లగుళ్ల అప్పారావు, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, డాక్టర్ మట్టా దయానంద్, తోట సుజలారాణి, దోమ ఆనంద్‌బాబు, రామిశెట్టి సుబ్బారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, పులి శ్రీనివాసరావు, ప్రవీణ్‌రెడ్డి, కమల్‌పాషా, పద్మజారెడ్డి, కంటే నాగలక్ష్మి, చల్లారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రాద్రి బ్యాంకు సేవలకు గుర్తింపు



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌తో చైర్మన్ కృష్ణమూర్తి, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: భద్రాద్రి అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు సేవలను గుర్తిస్తూ హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈమేరకు సర్టిఫికెట్(ఐఎస్‌ఓ సర్టిఫికెట్) అందిన సందర్భంగా శనివారం బ్యాంకు పాలకవర్గం బాధ్యులు సమావేశమయ్యారు. ఈసమావేశంలో చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, పాలక వర్గసభ్యులు, ఖాతాదారుల సహకారంతో బ్యాంకుకు గుర్తింపు లభించిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న 17 బ్రాంచ్‌లకు తోడు త్వరలో కొత్తగా ఆరు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్లు సన్నే ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ సాంబమూర్తి, సీఈఓ దాసరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే మేలు

కారేపల్లి: దేశమంతటా బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు డిమాండ్ చేశారు. కారేపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తుండగా, ఇక్కడ మాత్రం ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తూ బీజేపీ అధికారంలోకి వస్తోందని విమర్శించారు. ఇక జమిలీ ఎన్నికల పేరుతో లాభపడాలని బీజేపీ చూస్తోందన్నారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలిపారు. కాగా, కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో వాహనదారుల ఇక్కట్లు తీర్చేలా రైల్వే గేట్ల స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు భట్టు రాజేందర్‌నాయక్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 172మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో రాజేశ్వరరావు, సత్యప్రసాద్

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 172మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ తెలిపారు. శనివారం జరిగిన ఆఫ్ క్యాంపస్ డ్రైవ్‌కు 522మంది హాజరు కాగా 172మంది ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



సత్యనారాయణకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో షుగర్ బాధితుడికి వైద్యులు శనివారం అరుదైన ఆపరేషన్ (స్ప్లిట్ స్కిన్ గ్రాఫ్ట్) నిర్వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన సత్యనారాయణ ఎడమకాలిపై గాయం ఉండగా, ఇన్‌ఫెక్షన్ ఎక్కువవడంతో నెలకిందట ఆస్పత్రిలో చేరాడు. అయితే, గాయం మానినా అక్కడ చర్మం రాలేదు. దీంతో వైద్యులు సత్యనారాయణ కుడి తొడపైనుంచి చర్మం తీసి గాయం మానని చోట సర్జరీ ద్వారా అతికించారు. వైద్యులు సుధాకర్, రాంప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయకుమార్, అనస్తీషియన్ తేజావత్ రమేశ్, సిబ్బంది అరుణ, రాజేశ్, అనిల్ ఈ శస్త్రచికిత్సలో పాల్గొనగా అధికారులు అభినందించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖమ్మం అర్బన్: అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఓ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన ఘటన శనివారం రాత్రి జరిగింది. చింతకాని మండలం రామకృష్ణాపురం వైపు నుంచి ఖమ్మంకు ఓ ట్రాలీ ఆటో వెళ్తోంది. ఖమ్మం శివారు ధంసలాపురం వద్ద వెనక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టగా ఆటో ధ్వంసమైంది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. అయితే, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

అటూఇటుగా కాలం..

లెక్కకు మించి వానలు.. లక్ష్యం మేర పంటల సాగు

- వరికి మద్దతు ధర, బోనస్‌తో అన్నదాతల్లో ఆనందం
- పత్తికి ప్రతికూలం, మిర్చిని వీడని తెగుళ్లు
- భారీ వర్షాలతో పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
- వడివడిగా యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులు



ఆశాజనకంగా ఉన్న వరి


అన్నదాతలకు ఈ ఏడాది కొంత మోదం.. ఇంకొంత ఖేదం అన్నట్లుగా సాగింది. జూన్ మొదలు సెప్టెంబర్ వరకు సాధారణానికి మించి వర్షాలు కురిశాయి. ఇక సెప్టెంబర్‌లో రెట్టింపు వర్షపాతం నమోదైంది. జూన్‌లో కురిసిన వర్షాలకు పత్తి సాగు సకాలంలో మొదలుకాగా పెసర, కంది వంటి విత్తనాలు కూడా నాటారు. అంతేకాక భూగర్భ జలాలు పెరగడం, జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో వరి సాగు అంచనాలను మించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 5,53,813 ఎకరాల్లో సాధారణ పంటలు, ఉద్యాన పంటలు 1,64,711 ఎకరాల్లో సాగయ్యాయి. గతంతో పోలిస్తే అన్నీ కలిపి సాగు విస్తీర్ణం పెరిగినా పత్తి మాత్రం కాస్త తగ్గింది. ఈ స్థానంలో వరి విస్తీర్ణం పెరిగింది. ఈమేరకు 2024 ఖరీఫ్‌లో అన్నదాతలు ఆశలు ఏ మేర ఫలించాయో ప్రత్యేక కథనం.

– ఖమ్మంవ్యవసాయం

ఖరీఫ్‌లో సాగైన ప్రధాన వ్యవసాయ, ఉద్యాన పంటలు

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	2,91,724
పత్తి	2,07,950
పెసర	16,531
మొక్కజొన్న	2,785
మిరప	59,262
మామిడి	32,105
సుబాబుల్	30,179
ఆయిల్‌పామ్	25,440
కూరగాయలు	1,060

దెబ్బతీసిన భారీ వర్షాలు



ఆగస్టు 31 నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవగా మును పెన్నడూ లేని విధంగా వర్షపాతం నమోదైంది. దీంతో పంటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల పంట పొలాలు ఆనవాళ్లు కోల్పోయి ఇసుక, రాళ్ల మేటలు వేశాయి. కూసుమంచి, మధిర వ్యవసాయ డివిజన్లతో పాటు పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోనూ పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో 27,616 మంది రైతులకు చెందిన 28,179 ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు గుర్తించగా, ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.28,17,91,500 పరిహారం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 1,232 మంది రైతులు 5,582 ఎకరాల్లో పంటలు నష్టపోయారు.



అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి (ఫైల్)

పత్తి.. దిగుబడి తగ్గి

ఈ ఏడాదీ పత్తికి ప్రతికూలతే ఎదురైంది. అధిక వర్షాలు, తగ్గిన దిగుబడి, ధర లేకపోవటం రైతులను కుంగదీశాయి. ఆగస్టు చివరి వారం నుంచి కురిసిన వర్షాలతో పైర్లు ఎర్రబడ్డాయి. దీంతో ఎకరాకు దిగుబడి 10 క్వింటాళ్ల నుంచి ఐదు క్వింటాళ్లకు పడిపోయింది. మద్దతు ధర రూ.7,521గా ఉంటే రైతులకు రూ.5వేల నుంచి రూ. 6 వేలకు మించి దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ప్రయోజనం కలగలేదు.

మిర్చిని వీడని తెగుళ్లు

మిర్చికి ఈసారి కూడా తెగుళ్ల బెడద తప్పటం లేదు. తామర పురుగు వేధిస్తోంది. పురుగు మందులు వాడి తెగుళ్లను నియంత్రించినా ఊహించని విధంగా పంట ధర తగ్గుతోంది. గతేడాది సీజన్‌లో రూ.20 వేలు పలికిన క్వింటా మిర్చి ధర ప్రస్తుతం రూ.16వేలకు మించడంలేదు.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి

నూనెలకు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌తో ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు ఉండడంతో ఆయన ప్రత్యేక సారించి ప్రోత్సహిస్తున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరిగింది.

వరి అంతా ఓకే...

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంటగా వరి సాగవుతోంది. సన్నధాన్యం సాగు చేస్తే మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ చెల్లిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో పాటు వర్షాలు ఆశాజనకంగా ఉండడం అన్నదాతలకు కలిసొచ్చింది. దీంతో విస్తీర్ణంతోపాటు దిగుబడులూ పెరిగాయి. ఖమ్మం జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 2.82 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది 2.91లక్షల ఎకరాలకు పెరిగింది. ఇక భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,60,332 ఎకరాల్లో వరి సాగైంది. ఎకరాకు 35 బస్తాలకు పైగానే దిగుబడి రావడం రైతులకు సంతృప్తి కలిగించింది.

వడివడిగా యాసంగి

జలాశయాల్లో సమృద్ధిగా నీరు, ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలూ ఉండటంతో రైతులు యాసంగి సాగుపై దృష్టి సారించారు. ప్రధానంగా వరితో పాటు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలుచోట్ల వరి నార్లు పోయగా.. ఇంకొందరు పత్తి స్థానంలో మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ యాసంగిలో ఖమ్మం జిల్లాలో వరి 2.14లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా మొక్కజొన్న 91 వేల ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లాలో గతేడాది యాసంగిలో 60,927 ఎకరాల్లో వరి సాగు కాగా అది ఈసారి 68ఎకరాలకు పెరుగుతుందని అంచనా రూపొందించారు.

రుణమాఫీ అసంపూర్ణం

ప్రభుత్వం రూ.2 లక్షల మేర రుణాలు ఉన్న రైతులకు మాఫీ ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో దాదాపు 3.75 లక్షల మంది రూ.4,300 కోట్ల రుణాలు కలిగి ఉండగా నాలుగు విడతల్లో చేసినా 1,33,197 మంది రైతులకు రూ. 926.60 కోట్ల మేర మాఫీ అయ్యాయి. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని విడతల్లో కలిపి 64,187 మంది రైతులకు రూ.464.08 కోట్ల మేర రుణాలు మాఫీ అయినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.



వరదలతో ధ్వంసమైన పంటలు (ఫైల్)

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

ఖమ్మం నుంచిప్రాతినిధ్యం వహిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా ఉండడం మార్కెట్‌కు కలిసొచ్చింది. రాష్ట్రంలో రెండో పెద్ద మార్కెట్ కావటంతో దాదాపు రూ.140 కోట్లతో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు అనుమతులు వచ్చాయి. ఈ పనులు త్వరలోనే మొదలుకానుండగా మార్కెట్ రూపురేఖలు మారిపోనున్నాయి. మిర్చి విక్రయాల కోసం ప్రత్యేక నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు.

వరి దిగుబడి బాగుంది..



ఈ ఏడాది పంటల సాగు బాగున్నా వర్షాలు పత్తిని దెబ్బతీశాయి. పత్తి దిగుబడి లేక ధర రాక నష్టాలు తప్ప లేదు. వరి దిగుబడి బాగుంది. ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వడంతో ప్రయోజనం కలిగింది.

–గుగులోతు రవి, ఉప్పలచెలక, కొణిజర్ల మండలం

భారీ వర్షం దెబ్బతీసింది..



ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో పంటలు కోల్పోయాం. నాలుగెకరాల్లో వరి, పత్తి, మిర్చి పంట ధ్వంసమైంది. మోటార్ కూడా కొట్టుకుపోయింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా నష్టాన్ని గట్టెక్కలేకపోయాను.

–తేజావత్ వెంకన్న, తుమ్మలతండా, కూసుమంచి మండలం

సంతృప్తికరంగా సాగు



ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలతో పంటల సాగు సంతృప్తికరంగా ఉంది. వరి సాగు విస్తీర్ణం పెరగడమే కాక దిగుబడి, ధర ఆశాజనంగా ఉన్నాయి. అధిక వర్షాలతో పత్తి దిగుబడి కొంత తగ్గింది. మిర్చి ఇప్పటికైతే ఇబ్బంది లేదు.

–ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

రూ.95లక్షల బీమా చెక్కు అందజేసిన ఎంపీ



సీతయ్య భార్యకు బీమా చెక్కు అందజేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: వైరాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చెరుకుపల్లి సీతయ్య అక్టోబర్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.95లక్షల బీమా చెక్కు మంజూరైంది. ఈ సందర్భంగా ఖమ్మంలోని టాటా ఏఐయూ కార్యాలయంలో సీతయ్య భార్య శైలజకు శనివారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి చెక్కు అందజేశారు. అనంతరం వ్యాపార దిగ్గజం రతన్‌టాటా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఎంపీ మాట్లాడారు. టాటా సంస్థ ప్రజలకు ఎనలేని నమ్మకం ఉండగా, వ్యాపారం, దాతృత్వంలో టాటాలకు మించిన వారెవరూ లేరన్నారు. టాటా ఏఐయూ అధికారి సురభి ముకుంద రామ, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, స్ఫూర్తి, ఓం రాధా కృష్ణతో పాటుఉద్యోగులు శ్వేత, వి.వినోద్‌కుమార్, దేవరపు రమేష్, ఉప్పలయ్య, వరప్రసాద్, నాగేందర్‌రెడ్డి, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా బలగాలకు తప్పిన ముప్పు

దుమ్ముగూడెం: భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన 20 కేజీల అతిపెద్ద రెండు ఐఈడీ బాంబులను బలగాలు గుర్తించి నిర్వీర్యం చేయడంతో పెను ముప్పు తప్పింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా, పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డోర్నపాల్ నుంచి జాగరగుండ వెళ్లే రహదారికి సమీపంలో మావోయిస్టులు అమర్చిన 20 కిలోల 2 ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు గుర్తించాయి. వెంటనే స్వాధీనం చేసుకుని వాటిని నిర్వీర్యం చేశారు. ఆ ఐఈడీ విస్ఫోటనం చెందితే బలగాలకు భారీగా ప్రాణహాని జరిగేది.

పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

పాల్వంచ: పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పోస్టల్ శాఖ ఖమ్మం సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. పాల్వంచ పోస్టాఫీస్‌లో శనివారం సబ్ డివిజన్ పరిధిలోని గ్రామీణ తపాల ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ పోస్టల్‌శాఖ ద్వారా అమలుచేస్తున్న జీవిత బీమా, తదితర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. పాల్వంచ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీరన్న, ఐపీపీబీ మేనేజర్ సంజయ్, ఓవర్సీస్ దుర్గాప్రసాద్, సబ్ పోస్ట్‌మాస్టర్ నాగమనీషా, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బండి ఎల్లారావుతో పాటు తిలక్, రామారావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి



ల్యాబ్‌లో వివరాలు ఆరా తీస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. ఖమ్మంలోని మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్‌లో ఓపీ రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించాక ల్యాబ్‌లో పరీక్షలు, టీ హబ్‌కు పంపిస్తున్న శాంపిళ్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు, యూహెచ్‌సీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. మాతా, శిశు సంక్షేమం విషయంలో పకడ్బందీ ప్రణాళిక అమలుచేస్తూ మరణాలను అరికట్టాలని సూచించారు. అలాగే, సంక్రమణ వ్యాధులు, టీబీ కట్టడి, బయో మెడికల్ వేస్టేజ్ నియంత్రణపై సూచనలు చేశారు. అంతేకాక ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించేలా తరచుగా తనిఖీలుచేపట్టాలని ఆదేశించచారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, ప్రోగ్రాం అధికారులు సైదులు, చందునాయక్, రామారావు, వెంకటరమణ, డెమో సాంబశివరెడ్డి, యూపీహెచ్ డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఉద్యోగికి మేనేజర్‌గా పదోన్నతి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కూరపాటి శ్రీనివాస్‌కు మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆయనను మరిపెడ మున్సిపాలిటీ మేనేజర్‌గా బదిలీ చేస్తూ సీడీఎంఏ టీ.కే.శ్రీదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీజే నిర్వాహకుల అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని సెయింట్ మేరీస్ స్కూల్ ప్రాంతంలో డీజే ఏర్పాటు చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. డీజే శబ్దాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నట్లు అందిన ఫిర్యాదుతో ఏపీలోని కృష్ణాజిల్లా ఖమ్మంపాడుకు చెందిన ములకపాటి శివరాజ్, కొర్లపాటి నాగరాజును శనివారం అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించారు. కాగా, వన్‌టౌన్ ప్రాంతంలో వేడుకలకు వెళ్లి డబ్బు డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న ట్రాన్స్‌జెండర్లపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కేయూ అధికారి



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న రాజేందర్, తదితరులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలల్లో ఎం ఫార్మసీ పరీక్ష కేంద్రాలను కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కె.రాజేందర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ప్రిన్సిపాళ్లు రవికుమార్, డాక్టర్ కే.వీ.రమణారావు, పరీక్షల పరిశీలకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో గర్భిణిపై దాడి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో భూవివాదం నేపథ్యాన గర్భిణిపై దాడి చేశారని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేశ్వరపురంలో కొంత కాలంగా తన భూమిని కాజేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఎన్.రామకృష్ణ ఆరోపించారు. శనివారం పొలంలో పని చేస్తుండగా ప్రత్యర్థులు తనతో పాటు తన భార్య, గర్భవతి అయిన వాణిపై దాడి చేశారని పేర్కొన్నారు. ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా తనకు పోలీసులు న్యాయం చేయాలని కోరాడు.

కేజీబీవీలకు ఉపాధ్యాయుల కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీల్లో బోధనకు ఆటంకం ఏర్పడకుండా విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కేజీబీవీల్లో భద్రత కోసం పోలీస్ సిబ్బందిని, భోజనం సిద్ధం చేసేందుకు డీఆర్‌డీఓ ఉద్యోగులను కేటాయించారు. అంతేకాక బోధనకు ఆటంకం ఏర్పడకుండా ఒక్కో కేజీబీవీకి ఐదుగురు ఉపాధ్యాయులను నియమించగా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని ఏడు కేజీబీవీల్లో ఇప్పటికే ఇంటర్నెట్ సౌకర్యం సమకూర్చినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి శివారులో శనివారం సాయంత్రం కొందరు పేకాట ఆడుతుండగా ఎస్సై హరిక ఆధ్వర్యాన దాడి చేశారు. ఈసందర్భంగా ఏడుగురు పరారు కాగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అంతేకాక రూ.7,380 నగదు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ఖమ్మం అర్బన్: గంజాయి విక్రయిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గంజాయి విక్రయాల సమాచారంతో కొన్నాళ్లుగా నిఘా పెట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోవడమే గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితులను ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే, పూర్తి వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించే అవకాశముంది.

బిడ్డను ప్రేమవివాహం చేసుకున్నాడని ఆగ్రహం

అల్లుడిపై సీసాతో దాడి చేసిన మామ

ఖమ్మంక్రైం: ఓ వ్యక్తి తన కుమార్తెను ప్రేమవివాహం చేసుకున్న యువకుడిపై దాడి చేసిన ఘటన ఇది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కూసుమంచి మండలం సీతాతండాకు చెందిన గుగులోత్ అశోక్ నేలకొండపల్లి మండలం అజయ్ తండాకు చెందిన మానసను ప్రేమించగా నవంబర్ 8న వివాహం చేసుకున్నాడు. వీరి పెళ్లి యువతి తండ్రి బానోతు వెంకటేశ్వర్లుకు ఇష్టం లేదని తెలిసింది. కాగా, శనివారం మానస అనారోగ్యానికి గురవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆమె భర్త అశోక్‌తో కలిసి వచ్చింది. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో సమస్య ఉందని, శస్త్రచికిత్స చేయాలని తెలిపారు. దీంతో మానస తమ తల్లిదండ్రుల ఇంటి పక్క వారికి ఫోన్‌లో చెప్పగా వారు వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఈమేరకు ఆయన ఖమ్మంలోని ఆస్పత్రికి చేరుకోగా అక్కడ మానస వెంట అశోక్ ఉండడంతో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగక సమీపంలోనే ఉన్న స్పిరిట్ బాటిల్‌తో దాడి చేయగా తలపై బలమైన గాయాలై అశోక్ పడిపోయాడు. దీంతో స్థానికులు ఆయనను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అశోక్ తలకు బలమైన గాయం తగలడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పగా, ఖమ్మం టూటౌన్ పోలీసులు చేరుకుని విచారణ చేస్తున్నారు.

అప్పులు చేసి వెళ్లిపోయిన వ్యక్తిపై ఫిర్యాదు

నేలకొండపల్లి: అందినకాడికల్లా అప్పులు చేసి... ఆపై ముఖం చాటేసిన వ్యక్తికి సంబంధించి బాధితులు బయటకు వస్తున్నారు. ఏపీ నుంచి వచ్చి నేలకొండపల్లిలో కొన్నాళ్లుగా ఉంటున్న రఫీ అనే వ్యక్తి రూ.3కోట్ల మేర అప్పులు చేసి కనరాకుండా పోయిన విషయమై 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో రఫీ వ్యాపార భాగస్వామి కె.లక్ష్మయ్య తనను సైతం నమ్మించి మోసం చేశాడని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరికొందరు సైతం మౌఖికంగా ఫిర్యాదు చేయడంతో లక్ష్మయ్య కూడా సీఐ సంజీవ్, ఎస్సై పి.సంతోష్ శనివారం విచారించారు. అంతేకాక రఫీ నిర్వహించిన షాప్‌లో స్టాక్‌ను పరిశీలించారు. స్థానికంగా ఎవరెవరితో ఆయనకు లావాదేవీలు ఉన్నాయో ఆరా తీస్తూ కాల్‌డేటా, బ్యాంక్ ఖాతాల వివరాలు కూడా తెలుసుకున్నారు. ఈ విషయమై ఎస్సై సంతోష్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు అందిన ఫిర్యాదు మేరకు రఫీ సహా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.